క్లుప్తంగా

వాలీశ్వరాలయ ఆదాయం రూ.9.37 లక్షలు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీవాలీశ్వస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.9.37 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈఓ లత తెలిపారు. శనివారం దేవదాయ శాఖ సీఎఫ్ఓ దినేష్ సమక్షంలో ఆలయ చైర్మన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది కానుకలను లెక్కించారు. ఈఓ మాట్లాడుతూ కానుకల ద్వారా రూ.8.82 లక్షలు, టికెట్ల ద్వారా రూ.55 వేలు మొత్తం రూ.9.37 లక్షలు వచ్చినట్లు వివరించారు. ఇది ఒక ఏడాదికి సంధించిన హుండీ కానుకల ఆదాయమని తెలిపారు.

కైలాసనాథుని ఆదాయం రూ. 1.77 లక్షలు

నారాయణవనం: మండలంలోని కై లాసనాథకోనలోని కై లాసనాథస్వామి ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా రూ 1,77,489 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కృష్ణనాయక్, ఆలయ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్ తెలిపారు. శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు హుండీ ద్వారా రూ 77,868, టోల్‌గేట్ ద్వారా రూ 27,695, దర్శన టికెట్ల ద్వారా రూ 57,110, అభిషేక టికెట్ల అమ్మకాలతో రూ 9,086 ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకారం


లక్ష్మీనారాయణ

నారాయణవనం: నారాయణవనం ఎస్ఐగా లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పరమేష్ నాయక్ తిరుపతి వీఆర్‌కు వెళ్లారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



రాజులపాలెంలో ర్యాలీ చేస్తున్న మహిళలు

ఏర్పేడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ధాత్రి ఫౌండేషన్ డైరెక్టర్ స్వాతి అన్నారు. శనివారం మండలంలోని నాగంపల్లి ఎస్‌ఓఎస్ బాలల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో నెహ్రూ యువకేంద్రం, యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్ఐఆర్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ శేఖర్, ఎస్‌ఓఎస్ డైరెక్టర్ పరేష్, యువనేస్తం అధ్యక్షురాలు మునెమ్మ, అరుణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఏర్పేడు: మండల కేంద్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని కృష్ణంపల చెందిన రామిరెడ్డి(45) కొంతకాలంగా ఏర్పేడులో హోటల్ నడుపుతున్నాడు. శనివారం యూనియన్ బ్యాంకు వద్ద కాలినడకన రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఎడమ కాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కృష్ణాపురం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. చెన్నై నుంచి వస్తున్న కారును నారాయణవనం మండలం కైలాసకోన నుంచి చెన్నై వైపు వెళ్తున్న బైకు ఢీకొంది. బైకు మీద వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి, స్థానికులు 108కి సమాచారం అందించి క్షతగాత్రులను నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేను సిద్ధం..మా బూతు సిద్ధంకు స్పందన


మాట్లాడుతున్న గవర్లకృష్ణయ్య

కేవీబీపురం: వైఎస్సార్‌సీపీ 'నేను సిద్ధం మా బూతు సిద్ధం' కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల్లో విశేష స్పందన లభిస్తోంది. పార్టీ మండల కన్వీనర్ గవర్లకృష్ణయ్య శనివారం పెరిందేశం, ఆదవారం, వేమళపూడి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు విన్నవించిన సమస్యలను మండల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని కృష్ణయ్య తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, కార్యకర్తలతో సమావేశమై వైఎస్సార్ సీపీ మెజారిటీయే ధ్యేయంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

కైలాసవాసా.. కావగ రావా

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవానికి అశేషంగా భక్తులు తరలివచ్చారు. పట్టణంలో ఎటు చూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీస్వామి.అమ్మవార్ల రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. హరహర మహాదేవ, జై కాళి..జైజై కాళీ అంటూ రథాలను లాగి తన్మయత్వం చెందారు. రథాలపై ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. వాహనాల ఊరేగింపు ముందు సాంస్కృతిక కళాప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి – శ్రీకాళహస్తి



ఆలయంలో విశేష పూజలు, రథం లాగుతున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు


తెప్పోత్సవంలో భక్తజన సందడి

ఘనంగా శ్మశాన కొల్ల


అంకాళపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

సత్యవేడు: దళవాయి అగ్రహారంలో శ్రీఅంకాళ పరమేశ్వరి ఆలయ శ్మశాన కొల్ల ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఏటా శివరాత్రి మరుసటి రోజు (అమావాస్య)న నిర్వహించే శ్మశానకొల్ల(మయానసేవ)ను ఈసారి కూడా అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా శ్మశాన కొల్ల మైదానంలో మట్టితో భారీ దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దారు. ఆ ప్రతిమకు భక్తులు పిండి వంటాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారు ఆలయం నుంచి డప్పు వాయిద్యాల నడుమ మైదానానికి చేరుకోవడంతోనే అంకాళపరమేశ్వరి నామస్మరణలు మార్మోగాయి. దక్ష సంహారం ఘట్టం పూర్తి కాగానే భక్తులు ఆ మట్టి కోసం ఎగబడ్డారు. తర్వాత అమ్మవారి ఊరేగింపు ప్రారంభమైంది. చుట్టపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలో ఉన్న పురాతన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో శనివారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు ముందుగా విష్వక్సేన పూజ నిర్వహించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటాన్ని ఆరోహింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం వేడుకగా జరిగింది.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

వరదయ్యపాళెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం సంతవేలూరు, వరదయ్య పాళెంలో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు హెచ్చరికగా పోలీస్ కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.




స్మృతి వారియర్ కళాకారుల నృత్య ప్రదర్శన

ఘల్లు..ఘల్లు.. ఘల్లుమంటు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాంస్కృతిక కళావేదిక ధూర్జటి కళా ప్రాంగణంలో శనివారం నృత్యతీ స్కూల్ ఆఫ్ ప్రోమింగ్ ఆర్ట్స్, బెంగళూరు స్మృతి వారియర్ కళాకారుల నృత్యప్రదర్శనలు మంత్రముగ్ధులను చేసింది. కేరళకు చెందిన రేష్మ మీనన్ బృందం మోహినీ ఆట్టం నృత్యం రంజిపజేసింది. చెన్నైకి చెందిన శ్రావణ్ ఆలపించిన గీతాలు భక్తులను భక్తి తన్మయత్వంలో ఓలలాడించింది. – శ్రీకాళహస్తి

భక్తిగీతాలు ఆలపిస్తున్న చెన్నైకి చెందిన శ్రావణ్

మోహిని ఆట్టం నృత్య ప్రదర్శన

మహిళా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం


మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- 30 ఏళ్లు బొజ్జల కుటుంబం చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: నాడు డ్వాక్రా రుణమాఫీ అని నమ్మించి గద్దెనెక్కిన చంద్రబాబు మహిళలను దగా చేశారని, జగనన్న మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో అర్హులైన మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా మొత్తం రూ.5కోట్ల ఒక లక్ష, 93వేల 750 చెక్కును ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళల స్వావలంబన దిశగా జగనన్న అనేక పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30ఏళ్లు పాలించిన బొజ్జల కుటుంబం ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. గెలిచాక, హైదరాబాద్‌లో వెళ్లి సొంత వ్యాపారాలు చేసుకుంటూ ఆస్తులు కూడబెట్టుకుని ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. కరోనా సమయంలో వారు హైదరాబద్‌లో కూర్చుని ప్రాణభయంతో ఇంటికే పరిమితమైతే, తాను నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సొంత నిధులు రూ.కోట్లు వెచ్చించి అనేక సహాయక చర్యలను చేపట్టానని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్తగా పెళ్లి చేసుకున్న పేద ముస్లిం జంటలకు మేనమామ సాంగ్యం, నియోజకవర్గంలో ఎవరైనా మృతి చెందితే తన వంతుగా రూ.10వేలు సాయం ఇచ్చి అండగా నిలుస్తున్నట్లు వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బొజ్జల కుటుంబం హైదరాబాద్ నుంచి వచ్చి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నాటకాలు ఆడుతోందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి సుపరిపాలనకు మద్దతు పలకాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, భాస్కర్‌రెడ్డి, గెరటారెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, చంద్రయ్యనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, గురుస్వామినాయుడు, శ్రీకాళహస్తి దేవస్థానం సభ్యుడు భాస్కర్, పార్టీ నాయకులు చింతా రాజేంద్ర, శ్రీరాములురెడ్డి, సుబ్రమణ్యం, అల్లయ్య, నెలవల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం ఎస్ఐగా షరీఫ్



కేవీబీపురం: కేవీబీపురం ఎస్ఐగా మహ్మద్ షరీఫ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సునీల్ తిరుపతికి వెళ్లగా, అనంతపురం నుంచి షరీఫ్ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం





పాపానాయుడుపేటలో ఊరేగింపుగా వెళుతున్న ఉత్సవ మూర్తులు, విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు, కరకంబాడిలో ఊరేగింపు, పాండూరు జ్యోతీశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవ పూజలు

నారాయణవనం: మండలంలో ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కై లాసనాథకోనలో శ్రీకామాక్షాంబికా సమేత కైలాసనాథస్వామి ఆలయ మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కైలాసనాథునికి మహన్యాస పూర్వక లింగోద్భవ అభిషేకం, బిల్వార్చన చేశారు. ఉదయం 10 గంటలకు ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, సభ్యులు, ఈవో కృష్ణనాయక్ ప్రభుత్వం తరపున ఉత్సవర్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం కల్యాణోత్సవం ప్రారంభమైంది. కామాక్షాంబిక, కైలాసనాథునికి కల్యాణాన్ని తిలికించి భక్తులు పరవశం చెందారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు, పర్యాటకులకు భక్త మండళ్ల అన్నప్రసాదాలను అందజేశారు.

శాస్త్రోక్తంగా లింగోద్భవ పూజలు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున లింగోద్భవ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు రాత్రంతా ఆలయం వద్ద జాగరణ చేశారు. అర్చకులు నిరంజనాచార్యులు, ధర్మకర్త నందకుమార్ నాయుడు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

కమనీయం కల్యాణం

వరదయ్యపాళెం త్రయంబకేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 11గంటల పైన శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. నిర్వాహకులు పన్నెం బాలసుందరం, బొప్పన మోహనమురళీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో వెలసిన శ్రీచింతకోనేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి,అమ్మవార్ల ఊరేగింపు నయనానందకరంగా సాగింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భజనలు, నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు వేడుకగా జరిగింది.

అమ్మవారిపట్టెడలో..

మండలంలోని అత్తూరు పంచాయతీ అమ్మవారిపట్టెడలో శివాలయంలో శిరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు.

కమనీయం..శివపార్వతుల కల్యాణం

సత్యవేడు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవనరాజ విగ్నేశ్వరస్వామి ఆలయంలో శ్రీ విశాలాక్షి, విశ్వనాథస్వామి కల్యాణోత్సవం, వీరభద్రస్వామి ఆలయంలో మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం పూజలు కన్నులపండుగా సాగాయి. తిరుచానూరు చెందిన త్యాగస్వామి అర్చక బృందం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వీరభద్రస్వామి ఆలయంలో మృత్యుంజయస్వామికి తొలుత పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.తదుపరి అన్నాభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, ఫారెస్టు డివిజనల్ మేనేజర్ బ్రహ్మయ, ఎఫ్ఆర్ఓ జయప్రసారావు, రవికుమార్‌దేవర్ పాల్గొన్నారు.

వైభవం.. పరశురామేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కొండచుట్టు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం నుంచి శ్రీస్వామివారు, పలు దేవతా ఉత్సవ మూర్తులను 5 ట్రాక్టర్లలో కొలువుదీర్చి కొండచుట్టును ప్రారంభించారు. గుడిమల్లం దళితవాడ, మిట్టమీదకండ్రిగ, పెనుమల్లం, పెన్నగడం క్రాస్, పాపానాయుడు పేట, కళత్తూరువారిపల్లె, మర్రిమంద, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం, మూలకండ్రిగ, ఎండీపుత్తూరు, రాజులకండ్రిగ, పాయిల్‌సెంటర్, చెల్లూరు, గుండ్లకండ్రిగ, కుక్కలగుంట మీదుగా మళ్లీ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుంది. ఊరేగింపు గ్రామాల్లోకి ప్రవేశించగానే గ్రామస్తులు ఉత్సవ మూర్తులకు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు దినేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వరదయ్యపాళెం: స్వామి, అమ్మవారు


అమ్మవారిపట్టెడలో విశేష అలంకరణ



సత్యవేడు: విశాలాక్షి, విశ్వనాథస్వామి కల్యాణోత్సవం, మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం

నేత్రపర్వంగా ఉయ్యాల సేవ



నారాయణవనం: మండల కేంద్రంలో టీటీటీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారు ఊయ్యాల సేవలో సేదతీరారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ఊయ్యాల సేవలో సేదతీరుతున్న స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తన్మయులయ్యారు. అర్జితం అధికారి భరత్, ఏర్పాట్లను పర్యవేక్షించారు.